వారం వారం

# ఆ - కా - శ - వా - ణి
# సంగీత సమీక్ష

'పరుసవేది'

సోమవారం అక్టోబరు 23

## నేతి శ్రీరామశర్మగారి గానం

వీరిశైలి చక్కని పోషణతో నడుస్తోంది. దీక్షితుల వారి కీర్తనలు, పల్లవి గోపాలయ్య, వీణకుప్పయ్య శొంఠిసుబ్బయ్య వర్ణములు వల్లించి వానినుండి రాగపోకడలు నేర్చి, ఆమార్గాలలో సాధకం చేసి ముందుకి రావాలి శర్మగారు.

మంగళవారం అక్టోబరు 24

## సుసర్ల చినలక్ష్మీనరసింహ శాస్త్రిగారి ఫిడేలువాద్యం

వాయిస్తున్న విషయంలో పొరబాటు ఒక్కసారైనా రాకుండా ఉండాలనే శ్రద్ధతో వాయించారు శాస్త్రిగారు. బాగుంది. వాయించబోయే విషయముపై ఆలోచన నిలుపుతూ, వాయించేరీతి అలవాటు చొప్పున సునాయాసంగా దానంతట అదే నడిచేలాగ తయారు కావాలి. అది అమిత సాధక బలం ఉంటేనే సాధ్యమవుతుంది.

బుధవారం, అక్టోబరు 25

## జోస్యుల విశ్వనాథంగారి పాట

వీరి గాత్రంలో గమకం, ఒదుగు చక్కగా పలుకుతున్నాయి. రాగములో సునాయాసంగా సంచారము చెయ్యడమూ వీరు బాగా అలవర్చుకున్నారు. జీవస్వరాలవద్ద విశ్రాంతి తీసుకుంటూ రాగవిషయాన్ని రమ్యమైన అల్లికలతో రాగభావయుతమైన సంగతులుగా విభజించి కృతి చక్కగా పోషించుకుంటూ నిదానంగా పాడడం అలవాటు చేస్తే వీరి పాట రక్తివంతగా ఉంటుంది. దీక్షితులు శ్యామాశాస్త్రి క్షేత్రయ్య రచనలు ఈ సాధనానికి ఎక్కువగా తోడ్పడతాయి.

గురువారం అక్టోబరు 26

## కె. కామేశ్వరిగారి గానం

ఈమె శుద్ధమైన సంప్రదాయ శైలిలో కీర్తనలు పాడుతూ క్రిందటి రిసైటల్ కంటె విశేషంగా ప్రతీసారి గానం చేస్తున్నారు. తగిన పట్టుదలఉంటే వీరుబాగా వృద్ధిలోకి రావచ్చును. నారాయణి రాగకీర్తన ఇంకా దురితంగా పాడవలసింది. మధ్యమకాల కీర్తనలు అతిదురంగా పాడడం ప్రతీగాయకుడు సాధకం చెయ్యాలి. దాని వలన గాత్రానికి కొన్నిసర్దుబాట్లు అలవడుతాయి.

ఆదివారం అక్టోబరు 29

## నేమనూరికృష్ణమూర్తిగారి గానం

తొలికొన్సర్టు ప్రోగ్రాము కృష్ణమూర్తిగారు చాలా పట్టుదలతో పాడారు తోడిరాగం బాగా ఆలాపనచేశారు. ఫిడేలుమీద తోడిరాగం ముగిసిన వెంటనే మళ్ళీరాగం బదులు కీర్తన ఆరంభించి ఆ టైము నెరవుకి వినియోగిస్తే బాగుండియుండును. అనుక్షణమూ రంజింప చెయ్యాలనే పట్టుదలతో వీరివలె గానంచేసేవారు చాలా తక్కువ.

మంగళవారం అక్టోబరు 31

## డి. సూర్యప్రభగారి ఫిడేలువాద్యం

అతి సుస్వరంగా శ్రేష్ఠమైన రాగజ్ఞానం ప్రదర్శిస్తూ వాయించారీమె. లెక్కలు గ్రూపు తీసుకున్నవారు, ఫిడేలు సాధకం చేసినవారు స్త్రీలలో అరుదు. హిస్టరీగ్రూపు తీసుకునేవారు, వీణ వాయించేవారు మాత్రం వందలమీదనే. ఫిడేలు సాధించాలంటే అసాధారణమైన పట్టుదల, ఎడ

తెగని సాధకం అవసరం. లేకుంటే అపస్వరాలు వస్తాయి. ఈమె ప్రక్కవాద్యం అలవాటుచేసి మంచిపేరు తెచ్చుకోవాలి. షడ్జమం తీగపై పంచమం అందుకున్నప్పుడు స్వరస్థానము చెదురుతోంది. ఈ విషయం కొద్దిగా గమనించాలి సూర్యప్రభగారు.

గురువారం నవంబరు 2

## టి. యస్. యస్. రామమోహనబాయి గారి గానం

ఈమెపాట నీరసంగా వినవచ్చింది. ఇంకా కొంచెం బలంగా ఉత్సాహముతో పాడినప్పుడే గాత్రం శృతిలో కలిసి పాటకి జీవం పోసినట్లవుతుంది.

శుక్రవారం నవంబరు 3

## కంచర్ల సుబ్బనారాయణగారి నాగస్వర వాద్యం

వీరివాద్యంలో స్వరశుద్ధమైన ఏర్పాటులతో కూడిన సంగతులు చాలా స్వల్పంగా వినబడ్డాయి. పైకాలంలో గుంపులు గుంపులుగా స్వరాలు దొర్లించడం జాస్తి. ఆమోస్తరుగా వాయిస్తే రంజన కలుగదు, ప్రతీరాగానికీ సంప్రదాయ సిద్ధముగ ఏర్పడి పారంపర్యంగా వస్తూవున్న సంగతులు ఉంటాయి. అవిబాగా నేర్చివల్లెవేస్తేనేకాని రాగభావం స్వాధీనం కాదు. అటుపైన మనోధర్మశక్తి సరియైనమార్గంలోనే నడుస్తుంది. రాగభావం. ప్రదర్శింపని కల్పనకు ఏమీ విలువలేదు.

## డి. కె. పట్టమ్మాళ్‌గారి గానం

నేటిగాయనీ మణులలో శుద్ధమైన కర్ణాటక సంప్రదాయములో అతి మనోహరంగా గానం చేస్తున్నారు వీరు. ఒక్కసంగతికి కూడా తూకం చెదరనీయక గమక శుద్ధముగా వీనుల కింపుగా పాడడం యీమె మతం. ఎవరిదోషములు వారు పరిశీలించుకొని సాధకమువల్ల పరిహారం చేసుకుని రక్తిసంప్రదాయములపై దృష్టినిలిపి గానం చేస్తే పట్టమ్మాళ్ గారివలె పాడగలసిన గాయనులు ఆంధ్రదేశములో తయారుకాకపోరు. మనోధర్మ సంగీతము పాడబోయేముందు అభ్యాస సంగీతం సంప్రదాయ సమ్మతంగా అలవర్చుకోవాలి.

శాస్త్రజ్ఞులకొరకు

## బహిరంగ లేఖ

దీక్షితులు

ఈకాలంలో శాస్త్రంబాగా వృద్ధి పొందిందంటే దానికిమీరే కారకులు. కాని ఈక్రింద చెప్పిన పదివస్తువులూ మనదేశానికి చాలా అవసరం అన్న సంగతి కూడా ఈపాటికి మీరుగుర్తించే వుంటారు. అయినా తిరిగి జ్ఞాపకం చేద్దామనే ఉద్దేశ్యంతో రాస్తున్నాము కనక వెంటనే కనిపెట్టి పుణ్యం కట్టుకుంటారు కదూ!

1 చెంబు :— ఎవరైనా కుర్రవాడి చెయ్యి ప్రమాద వశాత్తూ చెంబులో ఇరుక్కున్నప్పుడు చెంబు ఆచెయ్యిని బయటికి నెట్టేమంచిచెంబు

2 పాలచెంబు .— నీళ్లుకలపినపాలు చెంబులోపోస్తే అది ఎర్ర గాతయారయి "లబోలబో" అని ఏడవాలి.

3 తక్కెడ — వ్యాపారి మనని అన్యాయం చెయ్యడానికి వేలితో తక్కెడ కర్రని వెనక్కి నొక్కుతూవుంటే ఆతక్కెడ కర్ర అతని వేలుని తేలులాగ కుట్టాలి.

4 తెల్లటోపీ :— ఈటోపీ పెట్టుకున్న బుర్రలో చెడ్డతలపులు వస్తే ఆటోపీ నల్లపడిపోవాలి.

5 ఉంగరం .— జేబుదొంగ లెవరన్నా దొంగతనానికి ప్రయత్నిస్తే ఈ ఉంగరం "ఏయ్! ఏయ్!" అని అరవాలి.

6 మైక్ :— ఉపన్యాసకుడు అడ్డదిడ్డమైన పేలాపనా పేలి చివర నీతివాక్యాలు చెప్పేటట్లయితే ఈ మైక్ వాణ్ణి ముక్కుపట్టుకొని రెండు దవడలమీద "ఫట్! ఫట్" మని వాయించాలి.

7 గొడుగు .— ఈ గొడుగు తమ యజమానురాలిని పరపురుషుడు, యజమానిని పరస్త్రీ గాని, ముట్టుకుంటే "వదులు. వదులు" అని అరవాలి.

8 చెప్పులు — యజమాని తప్ప ఇతరులు వీటిలో కాళ్లుపెడితే ఇవి కరవాలి.

9 పెన్ .— పరీక్షలో సమాధాన పత్రం మీద విద్యార్థి ఈకలం పెట్టేసరికి ఈ పెన్ సమాధానం పూర్తిగా రాసెయ్యాలి.

10 జ్యోతిష్యుడు .— జాతకం చూసి డబ్బు కోసంచి పొగిడే జ్యోతిష్కుడ్ని నక్షత్రాలు అందరికీ వినపడేటట్లు ఛడామడా తిట్టాలి.

మరచిపోరుకదూ! తొందరగా ప్రారంభించండేం! శెలవ్ మరివస్తా. (కన్నడ నుంచి)

1950 దశకంలో ఆనందవాణి అనే పత్రికలో " ఆకాశవాణి - సంగీత సమీక్ష " శీర్షికతో ప్రచురించబడ్డ వ్యాస పరంపరలోని కొన్ని వ్యాసాలు ఇక్కడ చూడవచ్చు.

ఇలాటివి, మరియు ఆకాశవాణికి సంబంధించిన ఏ చిన్న భాగం అయినా, అది ఆడియో అవ్వొచ్చు, ఫోటో అవ్వొచ్చు, వ్యాసం అవ్వొచ్చు, మరేదైనా అవ్వొచ్చు, అవి మీ వద్ద వుంటే పంచుకోగలరని ఆశిస్తూ....

కాపీరైటు హక్కుల ఉల్లంఘన ఉద్దేశం లేదనీ, లాభాపేక్ష / ధనార్జన ఉద్దేశమంతకన్నా లేదనీ సవినయంగా తెలియచేసుకుంటూ - ఈ వ్యాసాలు ఇక్కడ, ఇలా రేడియో అభిమానులకు అందుబాటులో ఉంచటానికి అభ్యంతరాలు ఎవరికైనా ఉంటే తప్పక తెలియపర్చండి. క్షమాపణలతో వెంటనే తొలగిస్తాను.

భవదీయుడు

మాగంటి వంశీ మోహన్

http://www.maganti.org/